దుర్గ నామస్మరణతో మార్మోగిన ఏడుపాయల

పాపన్నపేట, డిసెంబరు 1, ప్రభాతవార్త: భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం తల్లి వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులో అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగింది. కార్తీక పౌర్ణమి చివరి రోజుతో పాటు అమావాస్య పర్వదినం కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని తమ మొక్కుబడులు చెల్లించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కొలువున్న అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి ఆలయ అర్చకులు అభిషేకం చేసి అందంగా పట్టు వస్త్రాలు, రంగురంగుపూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన కార్తీక మాసం.. భక్తులతో సందడిగా శివాలయాలు

అల్లాదుర్గం, డిసెంబరు 1, ప్రభాతవార్త: కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకుని మండలంలోని శివాల యాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన అల్లాదు ర్గంలో మార్కండేయ మందిరం, వీరభద్రుడి ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలు, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు చేరుకుని ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలించిన తమ మొక్కులు చెల్లించుకున్నారు. అల్లాదుర్గంలోని శివాలయం శివనామస్మరనతో మారుమ్రోగింది. మండల పరిధిలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, చిల్వర్, చేవెళ్ల తదితర గ్రామాల్లోని శివాలయాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

ప్రజాపాలన కాదు పాపిష్టి పాలన

ప్రజా విజయోత్సవాలపై మండిపడ్డ బిఆర్ఎస్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అని చెప్పి దగా పాలన చేస్తున్నారని బిఆర్ఎస్ నాయకులు పాల సాయిరాం, గుండు భూపేష్‌లు మండిపడ్డారు.జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం చేసేది విజయోత్సవాలు కాదు వంచన ఉత్సవాలని ఆరోపించారు. ఎన్నికల ముందు చేత గానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ విజయోత్సవాల పేరిట ప్రజాధనం వృదా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో ఎ ఒక్క హామీ పూర్తిగా నెరవేర్చారో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన ఒక్క హామీనీ కూడా సరిగా నెరవేర్చలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలకు చేసే పనులకు అసలు పొంతనే లేదన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు బిఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలు మెచ్చేపాలనా చేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సాయన్నగారి సుందర్, ఈశ్వర్‌గౌడ్, సయ్యద్, మోహిజ్, నాగరాజు,రమేష్, గుజ్జ రాజు, హైమద్, బండి శ్రీకాంత్, రాజశేఖర్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు

స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు

కొమురవెల్లి, డిసెంబరు 1, ప్రభాతవార్త :

ప్రభుత్వం, దేవాదాయ,ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో భాగంగా 1 నుంచి 9 వరకు స్వామి వారి ఆలయానికి విద్యుత్ దీపాలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీ ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, దేవాలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పుడునప్రచారం సరికాదు కొమురవెల్లి మల్లన్న దేవాలయం లడ్డు,పులిహోరలో పురుగులు వచ్చినట్లు చేస్తున్నా ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆలయ ఈఓ బాలాజీ ఆదివారం ఖండించారు.లడ్డు,పులిహోరలో పురుగులు వచ్చినట్లు భక్తులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నార. భక్తుల మనోభావలు, దెబ్బతినడమే కాకుండా ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లే తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎలాంటి అదారాలు లేకుండా తప్పుడు ప్రచారాలు చేయొద్దన్నారు.

పోలీసు కిష్టన్న వర్ధంతి వేడుకలు

చిన్నకోడూరు, బెజ్జంకిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు/బెజ్జంకి, డిసెంబరు 1, ప్రభాతవార్త :

మళిదశ ఉద్యమకారుడు తొలి అమరుడు పోలీసు కిష్టన్న వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తూ డిసెంబరు 1ని తెలంగాణ రాష్ట్ర సాధన అమరుల స్మృతి దినంగా ప్రకటించాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పోలీసు కిష్టన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు కిష్టన్న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. సచివాలయంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య, చెరుకు పెద్దులు, పెండ్యాల బాలయ్య, జంగిటి అనందం, కొత్త బాలరాజ్, ఉప్పరబోయిన శంకర్,ఇట్టబోయిన శ్రీశైలం, కుందేల్ల దశరథం, ఇట్టబోయిన బాబు, చంద్రం,లింగం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

మళిదశ ఉద్యమకారుడు స్వరాష్ట్ర కోసం తన ప్రాణాలను వదిలిన తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కిష్టయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చీలాపూర్ మాజీ సర్పంచ్ రావుల మొండయ్య ముదిరాజ్ మాట్లాడుతూ పోలీసు కిష్టయ్య చేసిన త్యాగం మర్చిపోలేనిదన్నారు. రాష్ట్ర సాధనలో ముదిరాజ్ బిడ్డ తొలి అమరుడుగా ప్రాణ త్యాగం చేసి తెలంగాణ రాష్ట్ర నాలుగున్నర కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు కొరివి తిరుపతి, దేవనబోయిన సంతోష్, రావుల కనకయ్య, కోడూరు రాజయ్య, రావుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళలపై ఆసక్తి కల్పించాలి

వర్గల్, డిసెంబరు 1 (ప్రభాతవార్త): విద్యార్థులకు కళలపై ఆసక్తి కల్పించాలని మహాత్మ జ్యోతిబాపూలే వర్గల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గడ్డం భాస్కర్‌రావు పేర్కొన్నారు. వర్గల్ మండల పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, సాంస్కృతిక కార్యకలాపాలు, క్విజ్ పోటీలను నిర్వహించారు. అధ్యాపకులు గోవిందరావు నిర్వహణలో విద్యార్థులకు పోటీలను నిర్వహించగా తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, తెలంగాణ కళలపై, ఆహారపు అలవాట్లు, భాషా సాహిత్యం మొదలగు విషయాల గురించి వివరించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో మహిళా నేతలు

సతుల కోసం .. పతుల ప్రయత్నాలు
కోడలు కోసం మరొకరు..
పోటీలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు సైతం

సిద్దిపేట రూరల్, డిసెంబరు 1,ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి యేడాది కావస్తున్న నేటికీ సిద్దిపేట స్పెషల్ గ్రేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని భర్తీ చేయకపోవడంతో పదవిని అశిస్తున్న ఆశావహులు తీవ్ర నిరాశలో ఉన్నారు. స్పెషల్ గ్రేడ్ మార్కెట్ కమిటీని మహిళ జనరల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దశబ్దా కాలం పార్టీ అధికారంలో లేకున్న పార్టీని పట్టుకొని పని చేసిన నాయకులు ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకోవడనికి నమ్ముకున్న

శబనా అత్తు

అన్నపూర్ణ యాదగిరి

శ్రావణి సంజీవరెడ్డి

నేతల చుట్టూ ఆశావహులు ప్రదక్షణలు చేస్తున్నారు. సిద్దిపేట మార్కట్ కమిటీ పాలకవర్గానికి ప్రభుత్వం ఎప్పుడు గ్రీన్ స్నిగల్ ఇస్తుందన్నా ఆశతో ఆశావహులు ఎదురు చూస్తున్నారు.ఈ సారి ఎలాగైనా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని తమ సతులకు దక్కేలా ముగ్గురు నాయకులు పతులు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే మరో నాయకుడు తమ కోడలు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. వీరికి తోడు జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు సైతం మార్కెట్ కమిటీ పదవిని దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కష్టకాలం నుంచి పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీని నమ్ముకొని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పని చేస్తూ వస్తున్నా ఎం.డి.ఇమామ్(అత్తు) తన సతీమణి శబనాకి మార్కెట్ పదవిని దక్కించుకోవడానికి త్రీవ ప్రయత్నాలు చేస్తున్నారు. కష్ట కాలంలో పార్టీని పట్టుకొని జెండా మోస్తూ పార్టీ అధిష్టానం ఏ పిలుపునిచ్చిన పాల్గొం టూ వస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సైతం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తన వంతు ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి తాను నమ్ముకున్న మంత్రులు, నేతలను ప్రన్నం చేసుకోనే పనిలో ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే యువజన కాంగ్రెస్ నాయకుడు పూజల గోపికృష్ణ తన సతీమణి లిఖితకి పదవిని కట్టబెట్టడం కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. బొమ్మల యాదగిరి సైతం తన సతీమణి అన్నపూర్ణ కోసం పదవిని దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మరో సీనియర్ నాయకులు నాయిని నర్సింహ్మారెడ్డి తన కోడలు శ్రావణి సంజీవరెడ్డికి పదవి ఇప్పించడానికి తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అలాగే జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి సైతం పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మార్కెట్ కమిటీని ఎలాగైన దక్కించుకోవడానికి అశావ హులు మంత్రులు దామోదర రాజనర్సింహ్మ, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖతో పాటు నమ్ముకున్న నేతల చుట్టూ చక్కర్లు కోడుతున్నారు. మరి మార్కెట్ కమిటి పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం మరి.

ఘనంగా ప్రజా పాలన విజయోత్సవాలు ప్రారంభం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

"ప్రత్యామ్నాయ ఇంధన వనరులు" అనే అంశంపై నిర్వహించిన వ్యాచరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా మెదక్ పట్టనంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తాలో గల తెలంగాణ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చంద్రప్రాల్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నీలకంఠం, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, సంబంధిత ఉపాధ్యాయులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ రోజు విద్యా దినోత్సవం 21 మండలాల్లో పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో సత్కరించడం జరిగిందన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆలోచన శక్తిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని కలెక్టర్ అభివర్ణించారు. ప్రజా ప్రభుత్వంలో విద్యాశాఖకు సంవత్సర కాలంలో చేసిన ప్రభుత్వ చర్యలను తెలిపి వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పన, ఉచిత విద్యుత్, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, పండిట్స్, పీఈటీలు అప్‌గ్రేడేషన్, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలో 562 పాఠశాలల్లో 20 కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతులు మెరుగు పరచడం

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

జరిగిందని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారుల నియామకం, గతంలో ముగ్గురు మాత్రమే ఉన్న మండల విద్యాశాఖ అధికారులు ఇప్పుడు ప్రతి మండలానికి ఒకరు చొప్పున 21 మండలాల్లో వీరిని నియమించడం జరిగిందన్నారు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాల్లో భాగంగా 617 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, 1681 మంది ఉపాధ్యాయులకు బదిలీలు జరగగా, డీఎస్సీ-2024 ద్వారా 270 మంది కొత్త ఉపాధ్యాయుల నియామకాలు జరిగాయన్నారు. ఉచిత ఏకరూప దుస్తులు 78,288 మంది విద్యార్థులకు రెండు జతలు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీలో భాగంగా 8,02,928 మంది విద్యార్థులకు 6,61,355 ఉచిత పాఠ్యపుస్తకాలు, 1,29,125 ఉచిత నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంపుదలలో భాగంగా డైట్ చార్జీలు గతంలో ఉన్న దానికంటే 40 శాతం అధికంగా పెంచడం జరిగింది అన్నారు. కాస్మెటిక్స్ చార్జీలు గతంలో కంటే 250 శాతం పెంచడం జరిగిందని వివరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీనియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణ

గురుకులాలపై బిఆర్ఎస్ పార్టీ ది ముమ్మాటికి కుట్రే..

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1, ప్రభాతవార్త :

గురుకులాలపై బిఆర్ఎస్ పార్టీ ది ముమ్మాటికి కుట్ర కుతంత్రమేనని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 8 యేండ్ల పాటు గురుకులాల రాష్ట్ర కార్యదర్శిగా పని చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ ప్రస్తుతం బిఆర్ఆర్ నేతగా అవతారమెత్తి..రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నామ్ చేసే కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అధికారం కోల్పోయిన బిఆర్ఎస్ నాయకులు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. వాంకిడి గురుకుల పాఠశాలలో శైలజ అనే విద్యార్థి చనిపోవడం చాలా బాధకరమన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు పుడ్ పాయిజన్‌తో బాధపడుతున్నారని తెలియగానే బాధిత విద్యార్థులను ప్రభుత్వం వెంటనే అసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించిందన్నారు.విద్యార్థి మరణం పట్ల బిఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. గురుకులలో నాణ్యమైన భోజనం అందించడానికి ప్రభుత్వంతో పాటు మంత్రులు తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. శైలజ కుటుంబానికి మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, సీతక్క,కొండా సురేఖ్, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లు ధైర్యం చెప్పిన విషయాన్ని గురున్త చేశారు. ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాలలో నప్రభుత్వం విద్య, వైద్యం,నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు),నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, పూజల గోపికృష్ణ, పహీద్‌ఖాన్, షాబుద్దీన్, మంద పాండు, లక్ష్మీ, మహేందర్, అజ్మత్, వెంకటరెడ్డి, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అదుకునేలా చూస్తా

కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1,ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ 37వ వార్డులో నివాసముండే నిరుపేద కుటుంబానికి చెందిన తొంటోళ్ల జ్యోతి ఇళ్లు అగ్ని ప్రమాదానికి గురికావడంతో విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీఅనంద్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘటన జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉన్న నిత్యావసవస్తువులతో పాటు ఇతరు వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో కౌన్సిలర్ వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తన వంతుగా నిత్యావసరవస్తువులు అందించారు. ప్రభుత్వం అదుకోనేలా చర్యలు తీసుకుంటానని భరోసా కల్పించారు.

గుల్షన్ క్లబ్‌లో జిల్లా స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్ నిర్వహన

బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 1 ప్రభాతవార్త:

మెదక్ పట్టణంలోని గుల్షన్ క్లబ్‌లో ఆదివారం రెన్‌జూకీ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా స్థాయి కరాటే బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్‌ను నిర్వహించినట్లు కరాటే మాస్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బెల్ట్ ఎగ్జామ్‌కు చీఫ్ ఎగ్జామినర్‌గా రెన్‌జూకీ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అఫ్ ఇండియా వ్యస్థాపకులు, కరాటే సీనియర్ మాస్టర్ నగేష్ మాస్టర్, ఈ బెల్ట్ ఎగ్జామ్‌కు అబ్జర్వర్స్‌గా అశోక్, నవీన్ మాస్టర్‌లు వ్యవహరించారని తెలిపారు. ఈ కరాటే బెల్ట్ ఎగ్జామ్‌లో సుమారు 80 మంది విద్యార్థులు వివిధ మండలాల నుండి వచ్చినట్లు వివరించారు. ఈ కరాటే బ్లాక్ బెల్ట్ ఎగ్జామ్‌లో మెదక్ పట్టణానికి చెందిన ఆదిత్ రాజ్, కీర్తిలు ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు. గత 5 సంవత్సరాలుగా స్థానిక కరాటే మాస్టర్ విద్యాసాగర్ వద్ద శిక్షణ తీసుకున్నారని వారు వివరించారు. ఈ బెల్ట్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కరాటే మాస్టర్ నగేష్ మాస్టర్ బెల్ట్‌లు ప్రాధానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి సమాజంలో కరాటే నేర్చుకోవడం అమ్మాయిలకు ఎంతో అవసరం అన్నారు. కరాటే నేర్చుకోవడం వలన విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్‌లు రియాజ్, మల్లేషం, లావణ్య, ప్రసన్న, బ్లాక్ బెల్ట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గీత పోటీలకు అక్షర పాఠశాల విద్యార్థులు

జగదేవ్‌పూర్, డిసెంబరు 1 (ప్రభాతవార్త):

జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో గత కొద్దిరోజుల క్రితం జిల్లా స్థాయి గీత పోటీలను నిర్వహించగా అక్షర పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 7వ తరగతి విద్యార్థిని విష్ణుప్రియ ప్రథమ స్థానం, 5వ తరగతి విద్యార్థిని బి.జ్ఞానశ్రీ తృతీయ స్థానం, 4వ విద్యార్థి జి.ప్రణయ్ కన్సోలేషన్ స్థానంలో నిలువగా వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ గుర్జకుంట రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాలకు చదువుతో పాటు క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి గుర్తింపు తెచ్చినందుకు విద్యార్థులను అభినందించారు. వారికి పాఠశాల యాజమాన్యం అండగా ఉండి ప్రోత్సహిస్తుందన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లపై పోలీసులతో మాట్లాడుతున్న నర్సా రెడ్డి

సిఎం పర్యటన కార్యక్రమాల పర్యవేక్షణ

ములుగు, డిసెంబరు 1 (ప్రభాతవార్త):

నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబులు హిందుస్థాన్ లివర్ కోకాకోలా పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండతిమ్మాపూర్ గ్రామ శివారులో హిందుస్థాన్ లివర్ కోకాకోలా పరిశ్రమ నిర్మాణ పనులు పూర్తిచేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 12 గంటలకు హెలీకాప్టర్ ద్వారా పరిశ్రమకు చేరుకొని రిబ్బన్ కటచేసి పరిశ్రమను ప్రారంభించనున్నట్లు నర్సారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను ఆయన కార్యకర్తలతో కలిసి పర్యవేక్షించారు. పోలీస్ యంత్రాంగం సిఎం పర్యటన ఏర్పాట్లకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేతకి ఆలయాన్ని దర్శించిన అడిషనల్ ఎస్పీ

-అమావాస్య పూజలు అందుకున్న సంగమేశ్వరుడు



శ్రీ కేతకి ఆలయాన్ని దర్శించుకుంటున్న అడిషనల్ ఎస్పీ సంజీవరావు

ఝరాసంగం, డిసెంబరు 1, ప్రభాతవార్త: కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకుని మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీ దేవి సమేతంగా కొలువుండి భక్తులచే దక్షిణ కాశీగా నిత్యపూజలందుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆలయానికి తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

-ఆలయంలో అడిషనల్ ఎస్పీ పూజలు...

ఆదివారం అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకుని అడిషనల్ ఎస్పీ సంజీవరావు కేతకి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సంజీవరావు ఆమృత గుండంలో పాద ప్రక్షాళన చేసుకుని ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంజీ వరావుకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఎస్ఐ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

పోలీస్ కిష్టన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సా రెడ్డి, ముదిరాజ్ నాయకులు

గజ్వేల్ టౌన్, డిసెంబరు 1 (ప్రభాతవార్త):

గజ్వేల్ పట్టణంలో ఆదివారం తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టన్న వర్ధ

చెన్న బసవేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, డిసెంబరు 1, ప్రభాతవార్త: మండల పరిధిలోని మావినెల్లిలో కొలువుండి భక్తులచే నిత్య పూజలు అందుకుంటున్న శ్రీ చెన్న బసవేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. నాయకులు గుండేరావు పాటిల్ బసవేశ్వర్, మనోహర్ పాటిల్ పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాకారులన

పాపన్నపేట, డిసెంబరు 1, ప్రభాతవార్త: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన పాపన్నపేటలో ప్రాజ పాలన విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప అన్నారు.ఆదివారం మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు మండంలోని గాజుల గూడెం, నగ్సాన్‌పల్లిలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాకరులు ఆట పాటలతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు సిద్దులు, మాధవి, దేవదాస్, శేఖర్, ఎల్లయ్య, నరసయ్య, తుమ్మల ఎల్లయ్య, రామారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు ఆకుల శ్రీనివాస్, నాయకులు దోమకొండ కిషన్‌రెడ్డి, పోచయ్య, అబేద్ పాల్గొన్నారు.

టిటిడబ్లుఆర్ఎస్ పాఠశాలలో వ్యాస రచన పోటీలు

సిర్గాపూర్, డిసెంబరు 1, ప్రభాతవార్త: రీనివబుల్ ఎనర్జీస్ అంశంపై మండల స్థాయి వ్యాస రచన పోటీలు ఆదివారం మండల కేంద్రమైన సిర్గాపూర్ టిటిడబ్లుఆర్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ప్రజాపాలన-ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను పురస్కరించుకుని నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో మొదటి స్థానంలో అభిల రాథోడ్ (టిటిడబ్లుఆర్ఎస్), రెండవస్థానంలో ముత్యపుసాక్షి(సిర్గాపూర్ జడ్పీ హెచ్ఎస్), మూడవ స్థానంలో ఎస్ హరినాథ్‌గౌడ్ (టిటిడబ్లుఆర్ఎస్ నల్లవాగు) తెలుగు మాధ్యమంలో మొదటి స్తానంలో కె అంబిక (కెజిబివి), రెండవ స్థానంలో సిహెచ్ అక్షయ (కెజిబివి), మూడవ స్థానంలో జె అధితి (కెజిబివి)లు నిలువగా ఉపాధ్యాయులు బహుమతులను అందచేసినట్లు మండలవిద్యాధికారి నాగారంశ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో టిటి డబ్లుఆర్ఎస్ ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయులు మహేందర్, బార్దే విఠల్, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో గేదె మృతి

సిర్గాపూర్, డిసెంబరు 1, ప్రభాతవార్త: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని అంతర్గాంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి శనివారం నిత్యం లాగానే గేదెను సాయంత్రం ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో గ్రామ శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కట్ట వద్ద కరెంటు తీగకు తాకడంతో గేదె అక్కడికి అక్కడే మృత్యువాడ పడింది. మృతి చెందిన గేదె విలువ 60వేల రూపాయలకు పైబడి ఉంటుందని బాధిత రైతు నారాయణరెడ్డి తెలిపారు.

రాంరెడ్డికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూర్, డిసెంబరు1, ప్రభాతవార్త: మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామానికి చెందిన నాయకులు బొల్లెపల్లి రాంరెడ్డి చిత్ర పటానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాళులు అర్పించారు. గ్రామంలోని రాంరెడ్డి నివాసంలో ఆదివారం రాంరెడ్డి మూడవ వర్ధంతిని కుటుంబ సభ్యులు నిర్వహించారు. వర్ధంతి కార్యక్రమంలో పార్టీ నాయకులు రెంరెడ్డి కుమారులు బొలేపల్లి జగదీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు సంగారెడ్డి అంబారెడ్డి, విఠల్, వంశీ రాజు, ఇమ్రాన్‌లతో కలసి రాంరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పడిపూజలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షురాలు

రామచంద్రాపురం, డిసెంబరు1, ప్రభాతవార్త: రామచంద్రాపురం పట్టణంలో ఆదివారం గురుస్వామి చిన్నమైల్ మల్లికార్జున్‌రెడ్డి, చిన్నమైల్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, గురుస్వామి ఉమామహేశ్వర్ స్వామి సమక్షలో శబరీ గిరీశుడు అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని స్వామి వారిని సేవించుకున్నారు. పూజా కార్యక్రమంలో పెద్దమైల్ గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలకూరు రాజశేఖర్‌రెడ్డి, రాములు, ఈర్ల రాజు, గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సునీత లక్ష్మారెడ్డి, శంకర్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన భోజనలు

రామచంద్రాపురం, డిసెంబరు 1, ప్రభాతవార్త: రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అన్నాజీ ఆధ్వర్యంలో బీరంగూడ గుట్టపై శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు.ఆలయలో ఉదయం రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్నిఆచరించారు. ఈ సందర్భంగా చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు శశిరేఖ కులకర్ణి ముఖ్య అతిథిగా హాజరు అయిసాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షురాలు శశిరేఖ కులకర్ణి మాట్లాడుతూ బ్రాహ్మణ కులస్థులుఅన్నిరంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. బ్రాహ్మణులు ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వాలు బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేషాద్రి కుమార్, ప్రధాన కార్యదర్శి శేఖర్ శర్మ, కోశాధికారి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు ఫణిశర్మ, అనిల్ శర్మ, చంద్రబాబు, మాజీ గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి

గజ్వేల్, డిసెంబరు1(ప్రభాతవార్త): సమాజ సేవతోనే ఆత్మసంతృప్తిని ఇస్తుందని ఎస్‌బిఐ జిఎం ప్రకాష్‌చంద్ర భరోర్ తెలిపారు. ఆదివారం గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, జనరల్ సెక్రటరీ ఆంజనేయప్రసాద్, కార్యదర్శి జనరల్ కృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ నర్ర సంతోష్‌చందర్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ప్రకాష్‌చంద్ర బరోర్ మాట్లాడుతూ ఎంత పెద్ద ఉద్యోగం చేసినా సమాజ సేవ చేస్తేనే ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు. నిరంతరం పోటీ జీవితంలో పడి ఆరోగ్యాలను మరిచిపోతున్నామని, ఎంత డబ్బు ఉన్నా సరైన ఆరోగ్యం ఉంటేనే ముందుకు సాగుతామన్నారు. ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం బసవతారకం, అపోలో కార్పోరేట్ ఆసుపత్రుల ద్వారా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ క్యాంపులో ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి సంబంధించిన దాదాపు 500 మందికి సాధారణ వైద్యంతో పాటు బిపి, షుగర్, క్యాన్సర్, గుండెకు సంబంధించిన, కంటి పరీక్షలను ఉపయోగించుకున్నారని తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 40 మంది విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన లంబాడి నృత్య ప్రదర్శనకు బహుమతి ప్రధానం చేశారు. సొంత ఊరిలో వైద్య శిబిరం నిర్వహణపై ఏవో డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంతోష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు డిజిఎం జితేంద్రకుమార్, డిజిఎం (బివో) వివేక్‌చంద్ర జైస్వాల్, రీజినల్ మేనేజర్ అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, ఏజీఎంలు రాజ్‌కిరణ్, రమణ, చీఫ్ మేనేజర్లు మహిపాల్, కృష్ణారెడ్డి, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కిష్టయ్య వర్ధంతి వేడుకలు

రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 1, ప్రభాతవార్త : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని రామాయంపేటలో ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణానికి చెందిన పోచమ్మల అశ్విని-శ్రీనివాస్‌లు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమరుడు కిష్టయ్య అంతే కాకుండా మలిదశ ఉద్యమంలో తొలి అమరుడుగా కానిస్టేబుల్ కిష్టయ్యను గుర్తించి, ఆయన వర్ధంతిని అధికారికంగా జరిపించేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు పోచమ్మల సిద్దరాములు, సంఘం నాయకులు రెడ్డమైన నరేష్, దేవుని రవి, అక్కల మల్లేశం, రొయ్యల కిషన్, అబ్రమైన గంగారాం, భూమ సిద్దరాములు, చిలుక స్వామి, చింతల స్వామి, తొంటవాలి యాదగిరి, జీడిపల్లి సత్యనారాయణ, పోచమ్మల శివయ్య, యువజన అధ్యక్షుడు రమాకాంత్, కంబంపాటి విప్లవ్, గుడాల దిలీప్‌తో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజా పాలన పై బిఆర్ఎస్ అసత్య ప్రచారం

సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేస్తే సహించం

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్

నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్ డిసెంబర్ 1. ప్రభాతవార్త. : కాంగ్రెస్ ప్రజా పాలన పైన బీఆర్ఎస్ అసత్యపు ప్రచారం చేస్తోందని ఈవిదంగా సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలు చేస్తె సహించబోమని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది కాంగ్రెస్ ప్రజా పాలనలో హామీలన్ని అమలు చేశామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలన పైన పింక్ మీడియా తో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. గురుకులాల పైన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పెద్ద కుట్ర కు పాల్పడుతున్నాడని తాను గురుకులాల సెక్రటరీ గా ఉన్నప్పుడు నియమించుకున్న తన మనుషులతో ప్రభుత్వాన్ని బదనాం చేయాలని చూస్తున్నాడు..పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నీచానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. మా ముఖ్యమంత్రి 40 శాతం డైట్ చార్జీలు పెంచి మంచి భోజనం అందిస్తుంటే ఓర్వ లేక ఫుడ్ పాయిజన్ అంటు కుట్రలు చేస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాలుగా అన్ని వర్గాలను మోసం చేసిన బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీని బద్నం చేస్తుందని ఆరోపించారు. హాస్టల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హాస్టళ్లను దత్తత తీసుకుంటామని అన్నారు.జిల్లాకు చెందిన మాజీ మంత్రి హరీష్ రావు గారు ప్రజలను రెచ్చ గొడుతున్నారన్నారు..తెలంగాణ రాష్ట్ర ప్రజలు వారి అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితులో లేరని అన్నారు.ప్రజలకు ఎవరి సత్య

సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్, ఆవుల రాజిరెడ్డి తదితరులు

అసత్యాలతెలుసునని ఇటీవల కలెక్టర్ దాడి పై,సంక్షేమ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ పై బిఆర్ఎస్ రాజకీయ కుట్రలు చేస్తుందన్నారు. రైతు పక్షపాతిగా రైతుల సంక్షేమం కోసం పెద్దపీట వేస్తూ ఏడాది కాలంలోనే దేశంలో ఏ రాష్ట్రం ఖర్చు చేయని విధంగా 54,280 కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసి రైతన్న ఇంట్లో వెలుగులు నింపిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపిపి శ్రీనివాస్ గౌడ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్,నర్సాపూర్ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేష్,నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు అజ్మాత్, రషిద్, మల్లేష్ యాదవ్, సాగర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

టేక్మాల్, డిసెంబరు 1, ప్రభాతవార్త: ప్రజా పాలన దినోత్సవాల సందర్భంగా టేక్మాల్ కస్తూర్బా గాంధీ వసతి గృహంలో ఆదివారం మండల స్థాయి వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలు ప్రథమ బహుమతి విజేత ఎస్. వి. శ్రీజ 10వ తరగతి తెలంగాణ మోడల్ స్కూల్ ద్వితీయ బహుమతి విజేత హీన 9వ తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కున్సగి తృతీయ బహుమతి విజేత బి. సంగీత 10వ తరగతి జిల్లా పరిషత్ పాఠశాల ఎలకుర్తిలు గెలుపొందారు. గెలుపొందిన విధ్యార్థులకు బహుమతులను అందజేశారు. టేక్మాల్ ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పి.సుజాత,మండల పరిషత్ అభివృద్ధి అధికారి విట్టల్ నాయక్, కస్తూర్బ యస్ఓ బాలమణి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శాంసన్ రెడ్డి,రమేష్ గౌడ్, మల్లికార్జున్, మోలానా, వనరుల కేంద్రం సిబ్బంది యం.ఐ.ఎస్ శ్రీకాంత్‌గౌడ్, సిఆర్‌పి ధర్మ్యలు పాల్గొన్నారు.

4 నుండి జిల్లా స్థాయి వాలిబాల్ టోర్నమెంట్

టేక్మాల్ డిసెంబరు 1, ప్రభాతవార్త : బొంపల్లి రాజయ్య (కాద్లూర్) జ్ఞాపకార్థంగా టేక్మాల్ కాద్లూర్ గ్రామంలో జిల్లాస్థాయిలో స్మారక వాలిబాల్‌టౌర్నమెంట్ ఈనెల 4,తేది నుండి06 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యకక్రమానికి ముఖ్య అతిథులుగా ఆరోగ్య శాఖ మంత్రివార్యులు దామోదర్ రాజ నరసింహ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, సురేష్ కుమార్ షేట్కార్‌లు హాజరు కానున్నట్లు వారు చెప్పారు. టౌర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి : రూ. 20,116/ ద్వితీయ బహుమతి: రూ. 10,116/తృతీయ బహుమతి : రూ. 5,116/ క్రీడా కారులకు భోజన సౌకర్యం కల్పించినట్లు చెప్పారు.బొంపల్లి మధుసూధన్ (రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్) బొంపల్లి అనిల్ కుమార్ (మాజీ సర్పంచ్ కాద్లూర్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహణ

కొల్చారం, డిసెంబర్ 1ప్రభాతవార్త: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలోభాగంగా ఆదివారం కొల్చారం మండలంలోని అన్నిప్రాథమికోన్నత,ఉన్నత,కేజీబీవీ, టీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు "పునరు త్పాదక శక్తి వనరులు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రావు, మండల వనరుల సిబ్బంది సంపత్, రాజశేఖర్, శ్రీనివాస్, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో కొల్చారం టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ బాలికల పాఠశాలకు చెందిన సీహెచ్. వైష్ణవి మొదటి స్థానంలో నిలిచింది. చిన్నఘనపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన బి. పవిత్ర ద్వితీయ స్థానంలో, కొల్చారం ఉన్నత పాఠశాలకు చెందిన జె. అక్షయ్ కుమార్‌కు తృతీయ స్థానం నిలిచారు.

వెల్దుర్తిలో వ్యాసరచన పోటీల నిర్వహణ

వెల్దుర్తి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో "పునరుత్పాదక శక్తి వనరులు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మండల విద్యాధికారి యాదగిరి, కేజీబీవీ ఎస్‌వో కౌసర్ ఫాతిమా, రాములు, విజయ భాస్కర్ రెడ్డిలు హాజరయ్యారు.

ములుగులో ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ములుగు,డిసెంబరు 1 (ప్రభాతవార్త): మండలకేంద్రమైన ములుగులో అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ములుగకు చెందిన దాస చంద్రశేఖర్ 18వ మాలధారణ సందర్భంగా మహా పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన పందిరిలో 18 మెట్లపై కొలువుదీరిన అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహా పడిపూజ కార్యక్రమానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, బిఆర్ఎస్ యువజన నాయకులు జుబేర్‌పాషాతో పాటు అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మురళీధం శర్మ, బ్లూకలర్ నర్సయ్య, బలవంతరెడ్డి, గ్రామస్తులు, అయ్యప్ప భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు

సిద్ధిపేట,ప్రభాతవార్త ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వంలో గురుకులాలు అధ్వాన్నంగా తయారయ్యాయని బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సూరంపల్లి పర్శరామ్, జింకల పర్వతాలు,జంగిడి కమలాకర్‌లు అన్నారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గురుకుల పాఠశాలను, నారాయణరావు పేట బీసీ బాలుర గురుకుల పాఠశాలను, మైనార్టీ గురుకుల కళాశాలను బిఆర్ఎస్‌వి నాయకులు వేర్వేరుగా సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10 యేండ్లు సంక్షేమంలో ఉన్న గురుకులాలు 10 నెలల్లోనే సంక్షోభంలో పడ్డాయన్నారు. గురుకులాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన టిఫిన్, భోజనం.బాత్‌రూంలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదన్నారు. గురుకులాలలో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రభత్వం ఇప్పటికైనా స్పందించి గురుకులాలలో సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఆయా కార్యక్రమాలలో బిఆర్ఎస్‌వి నాయకులు రెడ్డి యాదగిరి, గరిపల్లి మహిపాల్‌గౌడ్, గుజ్జ రాజు,బండి శ్రీకాంత్, కోడెల నరేష్, బానుచందర్, గొల్లపల్లి రాజశేఖర్, జానకీచందు, సాయిలు పాల్గొన్నారు.

కెసిఆర్ సినిమా హిట్ ఖాయం:చెప్యాల రాజేశ్వర్‌రావు

గజ్వేల్, డిసెంబరు 1 (ప్రభాతవార్త): మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తెలంగాణ ఉద్యమంనుండి పదిసంవత్సరాల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించడంతో రాష్ట్రం బంగారు తెలంగాణగా మారిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం హైద్రాబాద్‌లో సంధ్య థియేటర్‌లో కెసిఆర్ సినిమా చూడడానికి కార్యకర్తలతో కలిసి తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ చిత్ర యూనిట్ హీరో రాకేష్ కెసిఆర్ చేసిన ఉద్యమంను, ఆయన పాలనను కళ్ళకు కట్టినట్లు చూపించడం అభినందనీయమన్నారు. కెసిఆర్ సినిమా వంద రోజుల పాటు ఆడాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం చిత్ర యూనిట్ హీరో రాకేష్, సుజాత, లోహిత్,నటీనటులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కెసిఆర్ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూసి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు మామిడి సురేష్, ఎక్కలదేవ్‌కనకరాజు,కాటుకళ్యాణ్, శ్రీకాంత్,సంజయ్‌దిరతు పాల్గొన్నారు.

ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ.మెదక్ ఎమ్మెల్యే ప్రశ్న

రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్1, ప్రభాతవార్త ఃమైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్‌వో)పేరుతో చేస్తానన్న సేవలు ఏమయ్యాయి...? ఎటుపోయాయని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావును ఉద్దేశించి భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారంనాడు రామాయంపేట మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై బిజెపి చార్జిషీట్"కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్రంలో అధికారం చేపట్టి సంవత్సర కాలం గడుస్తున్నా కానీఎలాంట గ్యారెంటీలు,హామీలు నెరవేర్చలేదన్నారు.

పదవి వచ్చాక ప్రజలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ నియోజకవర్గంలో మైనంపల్లి రోహిత్‌రావు ప్రజలకు ఇచ్చిన హామీలపై చార్జిషీట్ విడుదల చేసిందన్నారు. ఆయన ఇచ్చిన హామీలలో ఎన్ఎస్ఎఫ్ పున:ప్రారంభం ఎంతవరకు వచ్చిందని, ఏడుపాయల అభివృద్ధికి మోక్షం ఎప్పుడని, రామాయంపేట రెవెన్యూ డివిజన్ ఒక టేబుల్, రెండు కుర్చీలకే పరిమితమా...? అంటూ పలు హామీలను గుర్తు చేశారు. అంతేకాకుండా రామాయంపేట సబ్‌కోర్టు రాకపోవడానికి ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమన్నారు.

ఈ కార్యక్రమంలో మెదక్ అసెంబ్లీ ఇంచార్జి పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చిమ్మన్నమైన శ్రీనివాస్, ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షులు శ్రీనివాస్ గౌడ్, మండల ఇంచార్చి వెలుముల సిద్దరాములు, జిల్లా అధికార ప్రతినిధినందరెడ్డి,ఓబిసీ మోర్చాఅధ్యక్షులు కాశీనాథ్,బిజెవైఎం అధ్యక్షులు సతీష్, రామాయంపేట పట్టణ అధ్యక్షులు దమ్మయ్యగారి భానుచందర్, మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, కార్యదర్శి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శులు దిలీప్ కుమార్, నవీన్‌గౌడ్, కార్యదర్శి అవినాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, కార్తిక్, బూత్ అధ్యక్షులు దోమకొండ శ్రీనివాస్, వినయ్, నితిన్, భరత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్

నర్సాపూర్ డిసెంబర్1. ప్రభాతవార్త.: బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా తెలంగాణా లోఅభివృద్ధి శూన్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్ లు అన్నారు. ఆదివారం నర్సాపూర్ బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఏడాది గడిచినా ఇంకా అమలు చేయలేదని అన్నారు. అంతేగాక బిఆర్ఎస్ పార్టీ నుండి నర్సాపూర్ ఎమ్మెల్యేగా గెలిచి నర్సాపూర్ లో ఇండోర్ స్టేడియం, మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని చెప్పిన ఎమ్మెల్యే సునీత రెడ్డి ఇంతవరకు చేయలేదని అన్నారు ఈ మేరకు ప్రజలకు ఇచ

వేతనాల బిల్లులు మంజూరు చేయాలి
-సబ్ ట్రెజరీ అధికారికి టిఎస్ యుటిఎఫ్ బాధ్యులు

అధికారికి వినతి పత్రం అందచేస్తున్న టిఎస్ యుటిఎఫ్ నాయకులు

నారాయణఖేడ్ టౌన్, డిసెంబరు 1, ప్రభాతవార్త: అవినీతికి అవకాశం లేకుండా నూతన ఉపాధ్యాయుల వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నారాయణఖేడ్ సబ్ ట్రెజరి అధికారి మోతిరాంకు టిఎస్ యుటిఎఫ్ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బిల్లుల మంజూరులో ఎలాంటి జాప్యం కాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్, ఉపాధ్యక్షులు కాశీనాథ్ జాదవ్, జిల్లా కార్యదర్శి మడుపతి నరేష్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదరఉ్శలు హరిసింగ్, శ్రీరామ్ నాయక్, రాములు, రవీందర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు
-ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు

విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఎంఈఓ మారుతి రాథోడ్

న్యాల్‌కల్, డిసెంబరు 1,ప్రభాతవార్త: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా పాలన-ప్రజా విజయోత్స వ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మండల స్థాయి పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులు వ్యాస రచన పోటీల్లో తలపడ్డారు. పోటీల్లో ప్రతిభ చాటిన ముగ్గురు మిర్జాపూర్ (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొదటి స్థానంలో పి వినాయక్‌రెడ్డి, రెండవ స్థానంలో యు గణేష్, మూడవ స్థానంలో యం శ్రుతిలు నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈఓ మారుతి రాథోడ్ ప్రశంశిస్తూ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిరాజ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, భాస్కర్, లక్ష్మి, సిఆర్‌పి రవిలు పాల్గొన్నారు.

మునిపల్లిలో కార్తీక దీపోత్సవం

భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో

మునిపల్లి, డిసెంబరు 1, ప్రభాతవార్త: సదాశివపేట పట్టణంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి రోజైన ఆదివారం పూర్వ విద్యార్థులు కార్తీక దీపాలు వెలిగించి ఆలయ అర్చకులు బసవరాజు స్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంట శివయ్య, పృథ్వీరాజ్, శంకర్, వీరేశం, రవి, సంగమేశ్వర్, శ్రీశైలం, కృష్ణ, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, కంది కృష్ణ, గందిగరాజు, శంకరప్ప, సదాశివపేట చౌకి మఠం వీరశైవ సమాజం అధ్యక్షులు చీల మల్లన్న, శ్రీశైలం, కౌన్సిలర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వ్యాన రచన పోటీలు

గురుకుల పాఠశాలలో వ్యాసరచన పోటీలు రాస్తున్న విద్యార్థులు

పుల్‌కల్, డిసెంబరు1, ప్రభాతవార్త: మండల పరిధిలోని సింగూరు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతిలో విద్యను అర్జిస్తున్న విద్యార్థులు వ్యాస రచనలో పాల్గొని వ్యాసరచనలు రాయగా ప్రథమ స్థానంలో పి మహేష్‌కుమార్ (సింగూరు టిఎస్‌డబ్లుఆర్‌ఈఐఎస్), రెండవ బహుమతిని సిజి శిరీష (గొంగ్లూర్ జడ్పీహెచ్‌ఎస్), మూడవ బహుమతిని టి లక్ష్మీ (మిన్పూర్ జడ్పీహెచ్‌ఎస్)లు అందుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వంకర్, ప్రిన్సిపల్ ఆగమయ్య, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిన మాలలు

చౌటకూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త: మండల కేంద్రం చౌటకూరు నుంచి సికింద్రాబాద్ నిర్వహిస్తున్న సింహ గర్జన కార్యక్రమానికి ఆదివారం మాలలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జైమాల నినాదాలు చేస్తూ ప్రత్యేకంగాఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా మాలమహానాగు సంయుక్త కార్యదర్శి బేగరి యాదయ్య, బేగరి రాములు, బేగరి దేవయ్య, మన్నె పోచయ్య, దాసరి బాలయ్య, బేగరి మత్తయి, గౌని నరేష్, గౌని కరుణాకర్, బేగరి వినోద్, దాసరి సాయిలు, ప్రబు కిరణ్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

పాపన్న పేటలో..

పాపన్నపేట, డిసెంబరు 1, ప్రభాతవార్త: సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహిస్తున్న మాలల సింహ గర్జన సభకు మండలం నుంచి మాలలు పెద్ద సంఖ్యలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తరలివెళ్లారు.

నిజాంపేటలో ...

నిజాంపేట్, డిసెంబరు 1, ప్రభాతవార్త: సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహ గర్జన సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి మాలలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనంలో మాలలు జై మాల నినాదాలు చేస్తూ సభకు తరలివెళ్లారు.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం..కానిస్టేబుల్స్ జీవితాలతో చెలగాటం

పోలీస్ కానిస్టేబుల్ మృతి వెనుక అసలు నిజం..
మధ్యంతర ట్రాన్స్‌ఫరా...ఉన్నతాధికారుల ఒత్తిడా..
ట్రాన్స్‌ఫర్ అయినా పోలీసుల అందరి పరిస్థితి ఇదేనా!

హుస్నాబాద్‌రూరల్,డిసెంబరు1,ప్రభాతవార్త: హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని కోహెడ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే నవీన్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. అయితే సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ పెంబర్తి నవీన్‌కుమార్ గత జూలై నెల చివరి వారంలో సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నుండి కోహెడకు ట్రాన్స్‌ఫర్‌లో వచ్చారు.అప్పటికే తన పిల్లలను దుబ్బాకలోని ప్రయివేట్ పాఠశాలలో చేర్పించిన నవీన్ పిల్లల చదువుకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ప్రతీ రోజు దుబ్బాక నుండి కోహెడకు తన కారులో విధులకు హాజరై ఇంటింకి వెళ్తుండే వాడు 2012కు బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ నవీన్ విధినిర్వహణలో అంకిత భావంతో పని చేసే వాడని అందిన సమాచారం మేరకు తెలుస్తోంది. తాను పోలీస్ స్టేషన్‌లో విధులునిర్వహిస్తున్న సందర్భంలో అందరితో కలుపుగోలుగా ఉండేవారని,కానీ దుబ్బాక నుండి కోహెడ వరకు వాహనం పై వస్తూ వెళ్లడం ఇబ్బంది కరంగా ఉందని తోటి కానిస్టేబుల్‌లతో చెప్పుకుంటూ బాదపడేవాడని తెలిసింది.ఓ వైపు పిల్లల చదువుల గురించి ఆలోచన మరో వైపు పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పని చేస్తున్న తనపై కేసుల భారం,ఉన్నత అధికారుల ఒత్తిడిలో కోహెడ నుండి దాదాపు 70 కిలోమీటర్ల ప్రయాణంలో ఆలోచిస్తూ వెళ్ళడం వల్లనే ఈ ప్రమాదంజరిగి ఉంటుందని తనతోటి కానిస్టేబుల్లు అను కుంటున్నారు.అయితే పోలీస్ కానిస్టేబుల్‌ల బదిలీలో ఉన్నత అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో మంది కానిస్టేబుల్లు వారి గ్రామానికి దూరంగా బదిలీపై వెళ్లి భార్య,పిల్లలకు దూరంగా ఉండలేక రోజూ రాకపోకలలో తీవ్ర ఇబ్బందులకు గురవుతూ తమ బాధను ఉన్నతాధికారుల ముందు చెప్పుకోలేక తమలో తామే మనోవేదనకు

కుటుంబ సభ్యులతో కానిస్టేబుల్ నవీన్ (ఫైల్‌ఫోటో)

గురవుతున్నామని తమ ఆవేదనను ప్రభాతవార్త ఎదుట వెల్ల బోసు కుంటున్నారు.ఈ విషయంలో రాష్ట్ర పోలీస్ యంత్రంగం దృష్టి సారించి కానిస్టేబుల్‌ల బాదలను అర్థం చేసుకుని వారి ట్రాన్స్‌ఫర్‌ల విషయంలో పునరాలోచన చేయకపోతే మధ్యంతర ట్రాన్స్‌ఫర్‌లు అయిన కానిస్టేబుల్‌లకు సైతం ఇదే పరిస్థితి వచ్చే అవకాశం లేకపోలేదు.ఇలాంటి ఘటన మరొకటి చోటుచేసుకోక ముందే అధికారులు ప్రత్యమ్నయ చర్యలు తీసుకోవాల్సిన అవసరంఎంతైనాఉంది.అయితేమృతిచెందిన నవీన్‌కుమార్‌కు 9సంవత్సరాల క్రితం వివాహం జరగగా తనకు 7 సంవత్సరాల కుమారుడు,5సంవత్సరాల కూతురు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది.ఇక ఈ కానిస్టేబుల్ కుటుంబాన్ని ప్రభుత్వం,పోలీస్‌శాఖలు ఏవిధంగా ఆదుకుంటాయో వేచిచూడాల్సిందే.

మాలల సత్తా చాటేందుకే సింహ గర్జన

హత్నూర, డిసెంబర్ 1 ప్రభాతవార్త:మాలలపై జరుగుతున్న అసత్య ఆరోపణలను తిప్పికోడుతూ, మాలల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పెందుకు సింహ గర్జన చేపట్టినట్లు మాల మహానాడు హత్నూర మండల అధ్యక్షులు రాజీవ్‌గాంధీ అన్నారు. ఆదివారం నాడు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన సింహ గర్జనకు బయలుదేరే ముందు దౌల్తాబాద్ లోని అంబేద్కర్ విగ్రహానికిపూలమాలలు వేశారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ మనువాద రాజకీయ పార్టీలు దళితులకు వచ్చిన్నం చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకు మాల మాదిగాలను విభజించేందుకు ఎత్తులు వేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాంతకుమార్, మల్లేశం, కిష్టయ్య, లక్ష్మయ్య, దుర్గేష్,పాల్గొన్నారు.

ప్రజా పాలనపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎం.ఈఒ. వెంకటనర్సింలు

హత్నూర, డిసెంబర్ 1 ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు అనే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు పునరుద్ధరించే ఇంధన వనరుల వినియోగం అనే అంశంపై ఆదివారం మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎం.ఈ.ఒ వెంకటనర్సింలు తెలిపారు. ప్రథమ విజేతగా బి.వెంకట రమణ టీఎస్.ఈడబ్ల్యుఆర్‌ఎస్ స్కూల్ హత్నూర, ద్వితీయ బహుమతి విజేత భారత్ కర్మెల్ పాఠశాల, తృతీయ బహుమతి పి. వైశాలి కెజీబీవీ హత్నూర, విజేతలుగా స్థానిక ఎం.ఈ.ఒ. వెంకట నర్సింలు, గురుకుల పాఠశాల పిన్సిపాల్ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల విషయంలో డబ్బులు అడగడం సబబు కాదు

నారాయణఖేడ్,డిసెంబర్1ప్రభాతవార్త:నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు వేతనాల బిల్లుల విషయంలో ట్రెసరరీ అధికారులు డబ్బులు అడగడం సబబు కాదని యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్, ఉపాధ్యాక్షులు కాశీనాథ్‌లు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయుల వేతన బిల్లులమంజూరు విషయంలో ఎలాంటి అవినీతికి అవకాశం ఇవ్వ రాదని నారాయణఖేడ్ సబ్ ట్రేజరరీ అధికారి మోతిరాంకు కలిసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికి నూతన ఉపాధ్యాయులు తమ వేతన బిల్లుల విషయమై ఎవరికి ఎలాంటి రుసుములు చెల్లించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఒకవేళ రుసుములు చెల్లించిన వారు తీరిగి వాపసు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మడుపతి నరేష్, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు హరిసింగ్, శ్రీరామ్‌నాయక్, రాములు, రవీందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాల మహాగర్జనకు తరలి వెళ్లిన కంగ్టి వాసులు

కంగ్టి,డిసెంబర్ 1 ప్రభాతవార్త: హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన మాల సింహగర్జనకు కంగ్టి మండలం నుంచి మాల నాయకులు తరలివెళ్లారు. ఆదివారం కంగిన మండల అధ్యక్షులు గైని సాయిలు, ఉపాధ్యాక్షులు సిద్రం ఆధ్వర్యంలో హాలో మాల ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లే ముందుకు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జై అంబేద్కర్ అంటూ బయలు దేరారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ మండలంలోని నాలు మూలల నుంచి భారీ వాహనాల్లో తరలి వెళ్లారు. తమ హక్కుల కోసం పోరాటమే చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని వారు మాలలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దెగుల్‌వాడీ శంకర్, కెవిపిఎస్ మండల అధ్యక్షులు రాహుల్, మారుతి, సంగ్రామ్, ప్రకాష్, గణపతి తదితరులు తరలి వెళ్లారు.

ఉపాధ్యాయుల కొరకు ఆహ్వానం

కంగ్టి, డిసెంబర్ 1 ప్రభాతవార్త: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కంగ్టి పాఠశాలలో హిందీ సబ్జెక్టు టీచరుగా బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ అదికారి సి.హెచ్. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ పాఠశాలలో మహిళ అభ్యర్థి హిందీ బోధించుటకు గెస్టు టీచరుగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈనెల 4వ తేది లోపు కంగ్టిలోని కస్తూర్బా గాంధీపాఠశాలలో కార్యాలయపనిదినాల్లో దరఖాస్తులు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ కోరారు. మిగతా వివరాలకు సెల్‌నెం. 9505414708 నెంబర్‌కు సంప్రదించాలని ఆమె కోరారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

శివ్వంపేట,డిసెంబర్ 01 ప్రభాతవార్త : గడ్డి మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలిస్ స్టేషన్ పరిధిలోచోటుచేసుకుంది.ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపిన వివారాల ప్రకారం తాళ్లపల్లి తండాకుచెందిన ధనావత్ మెతిలాల్ (30) వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తుండేవాడు.కొద్ది రోజుల నుండి బయట తిరుగులకు అలావాటై పనిచేయకుండా అప్పులు చేసి మధ్యానికి బానిసై అప్పులవాళ్లు ఊరికే అడగడం వళ్ల 1వ తేదిన ఉదయం 6 గంటలకుపోలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు అతని భార్య పోలం వద్దకు వెళ్లి చుసేసరికికింద పడ్డి కొట్టుకుంటఉన్నాడు.చికిత్స నిమితం నర్సాపూర్ ప్రభుత్వ హస్పిటల్‌కుతరలించగా డాక్టర్లుచూసిచనిపోయినట్లు గుర్తించారు. మృతుని భార్య అనిత ఇచ్చినఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుకర్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియన యువకుడి మృతి

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1, ప్రభాతవార్త : సిద్దిపేట శివారులోని మిలాన్‌గార్డెన్ సమీపంలోని ఖాళీ స్థలంలో గుర్తు తెలియని మగ వ్యక్తి గాయాలతో పడి ఉండగా పొన్నాల గ్రామానికి చెందిన చింత సాయిచరణ్ చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిద్దిపేట అసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్సపొందుతూ వ్యక్తి మృతి చెందినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతుడు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే త్రీ టౌన్ పోలీసులను సంప్రదించాలన్నారు.

భగలాముఖి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

పూజలు నిర్వహిస్తున్న అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ

శివ్వంపేట,డిసెంబర్01 (ప్రభాత వార్త): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన భగలాముఖి శక్తిపీఠంలో అమావాస్య పురస్కరించుకోని ఆదివారం అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి హరిదార్చిన,మంగళ హరతి, మహమంత్ర హవనము,హోమము ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆమావాస్య పురస్కరించుకోని అమ్మవారిని దర్శించుకునెందుకు భక్తులు అధికసంఖ్యలో హజరై మొక్కులు చెల్లించు కున్నారు.అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.మాజీ జెడ్పిటిసీ పబ్బ మహేష్ గుప్తా అమ్మవారిని దర్శించుకునేందుకువచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థల దాత పబ్బ రమేష్ గుప్తా,మాజీ సర్పంచ్ కల్లూరి వెంకటేష్,నాయకులు వంజరి కోండల్,సూర్యం గౌడ్,భక్తులు పాల్గొన్నారు.

సింహగర్జనకు పెద్ద ఎత్తున తరలిన మాలలు

పాదయాత్రలో పాల్గొన్న పాల్గొన్న హుస్నాబాద్ మాలలు

హుస్నాబాద్‌టౌన్,డిసెంబరు1,ప్రభాతవార్త :ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయ మాలమహానాడు,మాల మహానాడుల ఆధ్వర్యంలో ఆదివారం రోజున హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహ గర్జన బహిరంగ సభకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి మాలలు,మాల ఉపకులాల ప్రజలు నియోజకర్గ కన్వీనర్ ఆరే కిషోర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివెళ్లి సంఘీభావం తెలిపారు.యాత్రకు హుస్నాబాద్ నుండి బయలు దేరిన నాయకులు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎస్సి వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల పునరాలోచన చేసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ బహిరంగ సభకు హుస్నాబాద్ నుండి 35 బస్సులలో 600ల మంది హాజరైనట్లు వివరించారు.బహిరంగ సభకు వెళ్లిన వారిలో సంఘం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు,మీడియా సేల్ కన్వీనర్ జాల శ్రీనివాస్ తో పాటు మండలంలోని అయా మండలాల,గ్రామాల అధ్యక్షులు,కార్యదర్శులు,మాలలు,మాల ఉపకులాలుఉన్నారు.

లక్ష పుష్పార్చన, ప్రత్యేక పూజలు

టేక్మాల్ డిసెంబరు 1, ప్రభాతవార్త : మండల కేంద్రమైన టేక్మాల్‌లో ఆదివారం లక్షపుష్పార్చన, బిలాకవర్చన, మొదలని కార్యక్రమాలు నిర్వహించారు. పారాయణతే ధరా అమ్మ గురు మాధనానందస్వామి జన్మస్థలం టేక్మాల్ గ్రాయతీ) మదనానంద్ స్వామి వారి పాదుకలను ఊంచి పల్లకీసేవగా ఊరేగింపు నిర్వహించారు. రంగంపేట ఆశ్రమ ఫీఠాదీశ్వరులు మాదమాందాస్వామి పర్యవేక్షణలో వేదపండితులతో రుద్రపారాయణం, లక్ష పుష్పార్చన, బిల్వార్చన, మొదలనికార్యక్రమాలు నిర్వహించారు. మాధవానంద స్వామి మాట్లాడుతూ ప్రతి భక్తి శ్రద్దలతో భగవంతుని చూడాలని, నిత్యం భవవంతుని మీదా భక్తిభావంతో ఉండాలని, ప్రజలందరు ధార్మిక కార్యక్రమాలతో పాల్గొని జీవితాన్నిచరితార్థం చేసుకోవా లని సూచించారు. ఈ పూజ కార్యక్రమాలకు జిల్లాన అదనపు కలెక్టర్ నగేష్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ఆయా పార్టీల మండలనాయకులు,కార్యకర్తలు,భక్తులుపాల్గొనితీర్థప్రసాదలు స్వీకరించారు. అనంతర భక్తులందరికి అన్నదానం నిర్వహించారు. క్రమంతో దేవాలయ కమిటి బృందం, జిల్లా వ్యాప్తంగా ఆశేష భక్తులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 1, ప్రభాతవార్త ఃమెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రామాయంపేట పట్టణానికి చెందిన వివేకానంద విద్యాలయం విద్యార్థులు జిల్లా ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు.పాఠశాలకు చెందిన డి. సిరిచందన, సాత్విక - రవాణా మరియు కమ్యూనికేషన్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా,ఏ. సహస్రరెడ్డి సహజ వ్యవసాయం విభాగంలో తృతీయ స్థానంలోనిలిచారు.ఈసందర్భంగా విద్యార్థులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు డీఈవో రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు బహుమతులుఅందుకున్నారు.ఈసందర్భంగా పాఠశాల ప్రధాన ోపాధ్యాయులు ఏ.రామ్‌కుమార్, గైడ్ టీచర్లు రాంప్రసాద్, బాలకిషన్, జ్యోతికలు విద్యార్థులను అభినందించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబర్ 1, ప్రభాతవార్త ఃరామాయంపేట మున్సిపాలిటీ 1వ వార్డు పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన బైరం దుర్గమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కును ఆదివారం నాడు స్థానిక కాంగ్రెస్ నాయకులు అందించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో బాధితురాలికి తన భర్త నర్సింలు ఆరోగ్య ఖర్చుల కోసం ఈ చెక్కును అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బైరాం కుమార్, నాయకులు బొట్ల బాబు, గావు భాస్కర్, బైరాం శంకర్, కుందెన రాములు, బైరాం రాజు, సంతోష్‌లు పాల్గొన్నారు. కళ్లి ఫండ్‌ను అందించేందుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాత్‌రావు, టీపీసీసీ అధికార ప్రతినిధి పల్లె రాంచందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వై. రమేష్‌రెడ్డితో పాటు మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులకు సహాయం పొందిన బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తేనేటి విందులో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప

పొన్నం ప్రభాకర్‌ను కలుసుకున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం, డిసెంబరు 1, ప్రభాతవార్త: హైద్రాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం బిసి సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ ఏర్పాటు చేసిన తేనేటి విందులో రామచంద్రాపురం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొన్నారు. తేనేటి విందుకు హాజరైన కార్పోరేటర్ ముందుగా మంత్రి పొన్న ప్రభాకర్‌కు అభివృద్ధి పనుల కొరకు (డ్రైనేజి పైప్‌లైన్ పనుల కొరకు) నిధుల మంజూరుకై వినతి పత్రం అందచేశారు.

కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న మాజీ ప్రోటెం ఛైర్మన్

రామచంద్రాపురం, డిసెంబరు 1, ప్రభాతవార్త: భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న కార్తీకోత్సవంలో తెలంగాణ శాసన మండలి మాజీ ప్రోటెం ఛైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, కార్పోరేటర్ వెన్నవరం సింధూ, బిఆర్ఎస్ రాష్ట్ర నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డిలు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు బొంబాయి కాలనీలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించి ఆలయంలో అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మైకోడ్‌లో భక్తి శ్రద్ధలతో యజ్ఞం

మనూర్, డిసెంబరు 1, ప్రభాతవార్త: గ్రామం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి మాసం మొదటి ఆదివారం గ్రామంలోని ఆలయంలో గ్రామ సుభిక్షాన్ని కాంక్షిస్తూ యజ్ఞాలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విధితమే. ఇందులో భాగంగా డిసెంబరులో మొదటి ఆదివారం ఆలయంలో గ్రామ దంపతులు యజ్ఞ హోమాల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో భీమన్న, శివరాజ్, సంగమేశ్వర్, వివేకానంద సేవా సమితి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాచేపల్లిలో వీధి దీపాల ఏర్పాటు

బాచేపల్లిలో వీధి దీపాలు బిగింపచేయిస్తున్న కాంగ్రెస్ నేతలు

నిజాంపేట్, డిసెంబరు 1, ప్రభాతవార్త: మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు వెళ్లే దారిలో వీధి దీపాలను కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేయించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి దృష్టికి విద్యార్థులు విద్యుత్ సమస్యను తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే పాఠశాలకు వెళ

మడ్‌పోర్ట్ ప్లే గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

క్రీడల ప్రోత్సాహానికి ప్రభుత్వం సహకరిస్తుంది : ఎమ్మెల్యే

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త: క్రీడలకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. అదివారం 3వ వార్డు దోబీఘాట్ సమీపంలోని హాకీ ప్లే గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కంటోన్మెంట్ దోబీఘాట్ ప్లే గ్రౌండ్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అందు వల్ల ఆధునీక సౌకర్యాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

2వ వార్డు ఇందిరమ్మ నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే . ..

కంటోన్మెంట్ 2వ వార్డు ఇందిరమ్మ నగర్‌లోని న్యూ లైఫ్ ప్రేర్ పవర్ చర్చిలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చిఫాస్టర్ నెహమియా, కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌సన్ రాజు, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిన నేతలు

సింహగర్జనకు తరలివెళ్తున్న మాల సంఘాల నేతలు

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం తలపెట్టిన మాలల సింహగర్జనకు అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్ నేత, మాలల సంఘం నేత నక్క మధు ఆధ్వర్యంలో వందలాది మంది మాల సంఘాల నేతలు తుకారాంగేట్ నుంచి పరేడ్ గ్రౌండ్‌కు ఊరేగింపుగా తరలివెళ్ళారు. ఈ ర్యాలీకి రాజకీయ పార్టీలకు అతీతంగా మాలల సింహగర్జనకు తరలివెళ్ళారు ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన మాల సంఘం నేతలు ఆర్.మల్లేశ్, కె.మహేందర్, విజయ లక్ష్మి, ప్రసాద్, నాగేశ్, ప్రకాశ్, అమర్,సుధాకర్, శారధ, పాండు, ప్రవీణ్, నర్సింగ్, రమేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోండా డివిజన్ అభివృద్ధికి కృషి : సంతోష్‌యాదవ్

బోర్‌వెల్స్ మరమ్మతులు చేయిస్తున్న సంతోష్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని పలు ప్రాంతాల అభివృద్ధికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సహాయ సహకారాలతో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ అన్నారు. ఆదివారం రైల్‌నిలయం అంబేద్కర్‌నగర్‌లో పాడైపోయిన బోర్‌వెల్స్‌ను జలమండలి సిబ్బంది సహకారంతో పాడైన బోర్‌వెల్స్‌ను మరమ్మత్తు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబురావ్, నాగేశ్ యాదవ్, నర్సింగ్, శివకుమార్ (జూలు) తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలు నిర్వహించడం అభినందనీయం : జంపన ప్రతాప్

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త: అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్, జయనగర్ చౌరస్తా ప్రాంతాల్లోని శ్రీదేవీ నల్లపోచమ్మ, చిన్నతోకట్టలోని కట్టమైసమ్మ దేవాలయం ప్రాంతాల్లో ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రతి అమావాస్యకు బోయిన్‌పల్లిలోని పలు అమ్మవారి దేవాలయాలో ల్ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, ప్రేమ్‌కుమార్, శ్రీకాంత్, దశరత్, నరేందర్, అజిత్, నర్సింహ్మా, రామారావ్, టింకూ గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి గౌరవ డాక్టరేట్

ప్రొ. మధుక్రిషన్‌నుంచి డాక్టరేట్ అవార్డు అందుకుంటున్న నర్సింగ్‌రావు

నిజాంపేట్, డిసెంబరు 1, ప్రభాతవార్త : నిస్వార్థ సమాజ సేవకుడికి అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ సమాజ సేవకుడు, బొల్లమల్ల నర్సింగ్ రావు చేస్తున్న సామాజిక సేవలను అమెరికన్ యూనివర్సిటి ఫర్ గ్లోబల్ పీస్ గుర్తించింది. మహా రాష్ట్ర రాజధాని ముంబైలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో అమెరికన్ యూనివర్సిటి చైర్మన్ అండ్ చీఫ్ రెక్టర్ ఆఫ్ ఏయుజీపీ ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్ చేతుల మీదుగా బొల్లమల్ల నర్సింగ్ రావు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. దళిత కుటుంబంలో జన్మించిన బొల్లమల్ల నర్సింగ్‌రావు చిన్నతనం నుండే ఎన్నో కష్టనష్టాల కోర్చి జీవితంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ.. ఎదు గుతూ సమాజంలో ఉండే పేదవారు, అభాగ్యుల పట్ల ఎంతో కరుణ కలిగి ఉండేవారు. తనకు తోచిన విధంగా పేదలకు సాయం చేస్తుండేవారు. కరోనా సమయంలో సైతం పేదలకు నిత్యావసర సరు కులు, ఆహారం, పంపిణీ వంటి కార్యక్రమాలు చేప డుతూ పలువురి ప్రశంసలు పొందారు. అంతేకాక నర్సింగ్‌రావు దళితులకు ఎలాంటి ఆపద వచ్చినా తాను ముందుండి పోరాడేవాడు. పాత్రికేయ రంగంలో కూడా అందరి మన్ననలు పొందారు. హోలిస్టిక్ మెడిసిన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ ప్రొఫె సర్ డాక్టర్ దీపక్ రౌత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్‌తో పాటు ఫరాబీ కజఖ్ నేషనల్ యూనివర్సిటి ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ డేమ్ తత్యానమాల్, శ్రీలంక మెడిసిన ఆల్టర్‌నేటివ్ డైరె క్టర్‌లు రోషన్ మద్దుమగె, సుగత్ కోటిన్‌కడువలు పాల్గొన్నారు. నర్సింగ్‌రావు స్పందిస్తూ డాక్టరేట్ అవార్డు ఇవ్వడం పట్ల ఎంతో సంతోషంగా ఉంద న్నారు. డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసిన అమె రికన్ యూనివర్సిటీ ఫర్ గ్లోబల్ పీస్ సంస్థకు, ప్రొఫెసర్ డాక్టర్ మధు క్రిషన్‌లకు ప్రత్యేక కృత జ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేరాల అదుపునకు సిసి కెమెరాలు దోహదం : ఎసిపి

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త: నేరాల అదుపునకు, శాంతి భద్రతల పరిరక్షణకు సిసి కెమెరాలు దోహదపడతాయని గోపాలపురం ఏసిపి సుబ్బయ్య తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ 4వ వార్డు భాస్కర్ రావ్ గార్డెన్‌లో కాలనీ వాసుల సహకారంతో సీసీటీవి కెమరాలను గోపాలపురం ఏసిపి సుబ్బయ్య, మారేడ్‌పల్లి సిఐ నోముల వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు బిఆర్ఎస్ నేత పనస సంతోష్, బసీ్త నాయకులు నర్సింహా, లింగం, రాజ్యం,చంద్రహరి, విజయ్, వెంకట్, శ్రీనివాస్, దుబ్బాక కిషన్‌రావ్ పాల్గొన్నారు.

నిత్య స్మరణీయుడు సిరివెన్నెల సీతారామశాస్త్రి

నాంపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త : సిరివెన్నెల సీతారామశాస్త్రి నిత్యస్మరణీయుడని, ఆయన రాసిన పాటలు ప్రతీరోజూ ఏదోఒక మాధ్యమం ద్వారా వింటూనే ఉంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం అన్నారు. బాపు రమణ అకాడమీ, అక్షజ్ఞ పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో వై.సత్యారావు మాస్టారు సభాధ్యక్షతన సిరివెన్నెల సుమధుర జ్ఞాపకాలు శీర్షికన జరిగిన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం ఆత్మీయ అతిథులు సీనియర్ పాత్రికేయులు ఎం.వి.ఆర్.శాస్త్రి, గుండు వల్లీశ్వర్, డా. పన్నాల కృష్ణసుబ్రహ్మణ్యం, కిరణ్‌ప్రభు, కృష్ణవంశీ, డా. కె.వి.ఎస్.ఎస్.ఆర్.కె.శాస్త్రి, శ్రీరామశాస్త్రి, అక్షజ్ఞ వెంకట్, అకాడమీ సుబ్బరావు తదితరులతో కలిసి చేంబోలు శ్రీరామశాస్త్రి రచన-సంకలనంలో రూపొందిన సిరివెన్నెల తొలిగురువు పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ గ్రంథం ఇదొక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జరుగుతున్న సన్నివేశాలే కనిసిస్తుంటాయన్నారు. మధ్యతరగతి కుటుంబాల్లో సామాన్యంగా తల్లిదండ్రులే మనకు ఆదర్శాలను నేర్పించడమే కాకుండా జీవిస్తారని,

ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం

సిరివెన్నెల తొలిగురువు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న =సుబ్రహ్మణ్యం, సత్యారావు, శాస్త్రి, తదితరులు

తమ కష్టాలు పంచుకోరని, తాము సాధించిన విజయాలు పిల్లలకు చెప్పరని, సత్యమార్గంలోనే జీవిస్తారని, అప్పుడే సుఖమొస్తుందని ఎవ్వరినీ మోసం చేయకుండా అడ్డదార్లు తొక్కకుండా ఆదర్శవంతం జీవిస్తారని తెలిపారు. సిరివెన్నెల ఇలాంటి ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబంలోంచి విశాలమైన దృక్పథాన్ని పొందారని, ఉదార్థమైన ఆలోచనలు వినిపించారు.... చూపించడమేకాక తన పిల్లలకు నూరిపోశారని చెప్పారు. ఈ పుస్తకం ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబకథని, ప్రతీఒక్కరూ తప్పక చదవాలన్నారు. సిరివెన్నెల జీవించి ఉంటే ఎన్ని మంచి విషయాలు చెప్పేవారో, జీవితాన్ని ఎన్నో కోణాల్లో ప్రతిబింబించేవారో, సత్యాన్ని ఎంతగొప్పగా చెప్పేవారో, ధర్మమార్గంలో ప్రేరణ కలిగించేవారో అనేబాధ వెంటాడుతూనే ఉందని వాపోయారు. అనంతరం మిగతా అతిథులు ప్రసంగించారు.

కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం జీవన శిష్య బృందం ఆధ్వర్యంలో భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రజ బృందం కదక్ నృత్య ప్రదర్శన ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది. కళాకారుల ప్రదర్శనలతో అందరిని ఆకట్టుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చిందని నిర్వహకులు తెలిపారు.

బ్యాంకుల ప్రైవేటీకరణను ప్రతిఘటించాలి

సైఫాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త: కార్పొరేట్ దోపిడీదారుల కోసమే బ్యాంకుల ప్రైవేటికరణ జరుగుతున్నదని, ప్రైవేటికరణకు వ్యతిరేకంగా బ్యాంకులలో పనిచేస్తున్న ఉద్యోగులలో సగభాగమైన మహిళా ఉద్యోగులు ప్రతిఘటించాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు పిలుపునిచ్చారు. అదానీ, అంబాని లాంటి దోపిడీ దారుల కోసమే ప్రధాని నరేంద్రమోదీ బ్యాంకులను ప్రైవేటికరణ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బ్యాంకులను ప్రైవేటు పరం చేస్తే సామాన్య ప్రజల పొదుపు దోపిడీకి గురవడంతోపాటు బ్యాంకు ఉద్యోగులకు భద్రతకు పెనుముప్పు ఏర్పడుతుందన్నారు. ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఎపి, టిఎస్) ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడలోని ఒక హోటల్‌లో జరిగిన బ్యాంకు మహిళా ఉద్యోగుల సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ ఆర్థికాభివృద్ధి తోడ్పడటానికి బ్యాంకుల జాతీయకరణ చేపట్టాలని దేశవ్యాప్తంగా ఎఐబిఈఎ చేసిన ఆనేక పోరాటాల ఫలితంగా ఇందిరాగాంధీ బ్యాంకుల జాతీయకరణ చేశారని, ఆనాటి నుంచి నేటి వరకు బ్యాంకింగ్ రంగం దేశఅభివృద్ధికి, ఆర్థిక వెన్నెముకగా మారి ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధికి వనరులు పెంపోందించడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఈ సదస్సులో ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ మౌనిక బోపన్న, ప్రముఖ పాత్రికేయురాలు కాట్రగడ్డ అజిత, అసోసియేషన్ ఛైర్మన్ కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలి

చార్మినార్, డిసెంబరు 1 ప్రభాతవాం : రాష్ట్ర ప్రభుత్వం విద్య,వైద్య ఆరోగ్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని,రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతి పక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పాతబస్తీ కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సంవత్సరం పూర్తియిన సందర్భంగా తొమ్మిదిరోజులపాటు నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలను విజయ వంతం చేయాలని ఆయన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను కోరారు. చార్మినార్ నియోజకవర్గంలోని మూసాబౌలిలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో యాభై వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని,బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని ఆయన తెలిపారు. ఎన్నికల్లో హామి ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఆయన తెలియజేశారు. టిపిసిసి కార్యదర్శి,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ అల్లం భాస్కర్ మాట్లాడుతూ రైతులకు రుణమాఫీని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టికే దక్కుతుందన్నారు. యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ వరలక్ష్మీ మాట్లాడుతూ పది సంవత్సరాలలో బిఆర్ఎస్ చేసింది ఏమి లేదని,కమిషన్లతోనే కాలం గడిపిందని,కేసిఆర్,కేటిఆర్‌లు తమ వైఖరిని మార్చుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో టిపిసిసి కార్యదర్శులు బాలరాజ్,అల్లం భాస్కర్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముజీబుల్లా షరీఫ్,బహదూర్‌పుర నియోజక వర్గం కాంగ్రెస్ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్,చాంద్రాయణ గుట్ట కాంగ్రెస్ ఇంఛార్జీ బోయ నగేష్,యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జీ కె.రవిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మూసాకాశిం, కె.వెంకటేష్, అస్గర్ అలీ పాల్గొన్నారు.

తెలంగాణలో టిడిపికి పూర్వవైభవం తీసుకు రావాలి

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతార్త: రాష్ట్రంలో టీడిపి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని కంటోన్మెంట్ నియోజకవర్గం టీడిపి హడక్ కమిటీ నేత జనగాం నర్సింగ్ తెలిపారు. ఆదివారం నేతాజీ నగర్‌లో అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో టీడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నియోజకవర్గానికి చెందిన టీడిపి నాయకులు శ్రీరాములు యాదవ్, అమృద్దీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వక్తలు..

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో పోలీస్ కిష్టయ్య త్యాగం వెలకట్టలేనిదని వక్తలు అన్నారు. పోలీస్ కిష్టయ్య స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధన మలి ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతి సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో స్మారకోపన్యాస సభ సీనియర్ జర్నలిస్టు పెట్టల రవీందర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, టీఎస్పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణితో కలిసి మాట్లాడుతూ మలి దశ తెలంగాణ ఉద్యమం దేశ చరిత్రలోనే అతి పెద్ద ఉద్యమంగా నిలుస్తుందన్నారు. నాడు ఉద్యమ రథసారథి కేసీఆర్ అరెస్టు, ఆమరణ దీక్షల తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో నిరాశ నిస్పృహల మధ్య యువత ఆత్మహత్యలకు పాల్పడిందన్నారు. తమ బలిదానాతోనైనా తెలంగాణ సిద్ధిస్తుందని వారు ఆకాంక్షించి పోలీసు కిష్టయ్య, శ్రీకాంత చారిలాంటి వారు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. స్వరాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన వారి జీవితాలకు ఒక అర్థం ఉందని, కోట్లాది మంది ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ కోసం అమరులైన క్రమంలో వారు రాసిన ఉత్తరాలే తెలంగాణ కోసం వారు పడ్డ తపన, ఉద్యమ ఆకాంక్షలు చెబుతాయన్నారు. తెలంగాణ కోసం బలిదానాలు చేసి 1200 మంది అమరుల చరిత్రను సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన అవసరం ఉందన్నారు. రిటైర్డ్ ఐజీ నరసింహ మాట్లాడుతూ తెలంగాణ కోసం అమరులైన వారి త్యాగాలకు గుర్తింపు దక్కాలన్నారు. ట్యాంక్‌బండ్పై అమరుల విగ్రహాలను ప్రతిష్టించాలని, వారి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు ఉప్పరి నారాయణ ముదిరాజ్, యాదిగిరి ముదిరాజ్, సుమిత్ర, కిష్టయ్య సతీమణి పద్మ, కుమారుడు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడ కమలానెహ్రూనగర్‌లో....

సరూర్‌నగర్, డిసెంబరు 1 ప్రభాతవార్త: తెలంగాణ మలి దశ ఉద్యమంలో తొలి అమరుడైన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్‌లకు గర్వకారణమని రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు బొమ్మరబోయిన యాదగిరి ముదిరాజ్ అన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో తన తుపాకీతో కాల్చుకొని అమరుడైన పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ కమలానెహ్రూనగర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి యాదగిరి ముదిరాజ్ పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పట్లో కిష్టయ్య బలిదానంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి అందరిలో స్ఫూర్తి నింపిందని అన్నారు. అయితే కిష్టయ్య ప్రాణ త్యాగాన్ని గుర్తించి ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని యాదగిరి ముదిరాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు కేతరమోని సుదర్శన్ ముదిరాజ్, పురకరం శివశంకర్ ముదిరాజ్, ఐలగోని కుమార్ ముదిరాజ్, మేకల కృష్ణ ముదిరాజ్, గంట రామకృష్ణ ముదిరాజ్, బోయిన శివకుమార్ ముదిరాజ్ తమ్మడ రాధాకృష్ణ ముదిరాజ్, మన్యం శ్రీనివాస్ ముదిరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న యాదగిరి ముదిరాజ్ తదితరులు

సింహగర్జనకు తరలివెళ్తున్న కంటోన్మెంట్ నేతలు

మాలల హక్కుల సాధనకు ఉద్యమించాలి : రవీందర్

కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతార్త: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జనకు యూనిటీ ఆఫ్ కంటోన్మెంట్ మాలల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలకు అతీతంగా పికెట్ చౌరస్తాలోని బాబుజగ్జీవన్ రామ్ చౌరస్తాల నుంచి మహనీయులకు పూలమాలలు వేసి సింహగర్జన సభకు తరలివెళ్ళారు. మాలల ఐక్యతను చాటుతూ జై మాల, జైజై మాల అంటూ జెండాలు చేతబూని ఊరేగింపుగా తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో మాలల సంఘం నేతలు సంకి రవిందర్, సుష్మిత శంకర్ రావ్, కె.డి.రమేశ్, మాజీ బోర్డు మెంబర్ నళిని కిరణ్, భాగ్యమ్మ, సనాధి శ్రీనివాస్, సాయికుమార్, సతీష్ కుమార్, ఉదయ్, నర్సింగ్‌రావ్, శ్రీహరి, రావుల సతీష్, యాదగిరి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను సంఘటిత శక్తిగా తీర్చిదిద్దాలి

కుత్బుల్లాపూర్, డిసెంబరు 1 ప్రభాతవార్త : ముదిరాజ్‌ల సంక్షేమానికి, ఐక్యతకు యువత మరింత కట్టుబడి వుండాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు జగన్‌మోహాన్‌రావు అన్నారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి ముదిరాజ్ సంఘ యువజన విభాగం అధ్యక్షులుగా చింతల్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన కోడి ఆదిత్యాముదిరాజ్‌కు నూతనంగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయంగా, ఆర్థికంగా ముదిరాజ్‌లు స్వయంకృషితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని సూచించారు. మేడ్చెల్ మల్కాజ్‌గిరి జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా ఎన్నికైన కోడి ఆదిత్యా ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘ అభ్యన్నతికి శాయశక్తులా కృషిచేస్తానని అన్నారు. తనపై పెద్దబాధ్యతను పెట్టిన రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహాన్‌రావుకు, రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చెల్ ఫిషరీస్ విభాగం చైర్మెన్ మన్నెరాజుముదిరాజ్, నాయకులు కోల రవిందర్ ముదిరాజ్, భారతీయ జనతాపార్టీ నాయకులు గరిగె శేఖర్ ముదిరాజ్ తదితరులుపాల్గొన్నారు.

అనాధ శవానికి మాతృదేవోభవ అంత్యక్రియలు

సరూర్‌నగర్, డిసెంబరు 1 ప్రభాతవార్త: అనాధ శవానికి నాదర్‌గుల్ మాతృదేవోభవ ఆశ్రమం వారు అంత్యక్రియలు జరిపి మానవత్వాన్ని చాటుకున్నారు. రెండు నెలల క్రితం నాగోల్‌లోని రోడ్డుపక్కన కాలు ఉబ్బి దీన స్థితిలో ఉన్న మానసిక దివ్యాంగుడైన ఓ మూగ వ్యక్తి(65) పరిస్థితి తెలుసుకున్న ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి అభాగ్యుడిని ఆశ్రమానికి చేర్చాడు. అయితే ఆరోగ్యం క్షీణించిన అతను ఆదివారం ఉదయం కన్నుమూశాడు. దీంతో ఆదిభట్ల పోలీసులకు సమాచారం అందించిన గిరి అనాధ అయిన బాధితుడి మృతదేహానికి స్థానిక నాదర్‌గుల్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి చేసిన ఆర్థిక సాయంతో తన కుమారుడు అభిరాంతో కలిసి దహన సంస్కారాలు నిర్వహించి స్ఫూర్తిగా నిలిచారు. స్వంత కుటుంబ సభ్యులను సైతం పట్టించుకోని పరిస్థితులు ఉన్న నేటి సమాజంలో గిరి సేవా దృక్పథంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తూ చనిపోయే మానసిక వికలాంగులకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటా: రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 1 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ డివిజన్లలోని కాలనీల్లో ప్రజలకు ఏ ఆపద వచ్చిన అండగా ఉంటానని మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. మాతృ వియోగం పొందిన న్యూ తిరుమలనగర్ కాలనీ మాజీ అధ్యక్షుడి కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన వారికి అండగా నిలిచి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్మాస్‌గూడ డివిజన్లలోని కాలనీల ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఆదుకుంటానని అన్నారు. స్థానిక కాలనీవాసుల సమస్యలు తీర్చి వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

భాస్కర్‌రావ్ గార్డెన్‌లో సిసికెమరాలను ప్రారంభిస్తున్న ఎసిపి

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

గచ్చిబౌలి, డిసెంబరు 1 ప్రభాతవార్త :

నగరంలో రద్దీగా ఉండే ఆర్‌టిసి బస్సులు, మెట్రో రైళ్లలో ప్రయాణికుల వస్తువులను చోరీ చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ప్రయాణికుల చుట్టూ చేరి వారి విలువైన సెల్‌ఫోన్లు, బంగారు ఆభరణాలు తస్కరించడంతో పాటు దృష్టిమరల్చి చోరీలు చేయడం వీరి ప్రత్యేకత. ఈ ముఠాలని 5గురిని పోలీసులు అరెస్టు చేయడగా, మరో ఇద్దరు పరారీలో